పర్యాటక ప్రాంతాలు కిటకిట

ప్రజాశక్తి -అనంతగిరి:ప్రముఖ పర్యాటక కేంద్రం బొర్రా కటికి, తాడిగుడ, చిటంపాడు జలపాతాలు, డముకు, సుంకరమె, కాఫీ ప్లాంటేషన్‌ను పర్యాటకులు తిలకించారు. అక్కడి అందాలను తిలకిస్తూ కుటుంబ సమేతంగా గడిపారు. వేలాది మంది పర్యాటకులు సందర్శించడంతో కిటకిటలాడాయి. అనంతగిరి, అరకు ఘాట్ రోడ్డు వాహనాలతో కిటకట లాడాయి.

బొర్రా గుహల్లో పర్యాటకులు

ప్రభుత్వ తీరుపై అంగన్వాడీల ఆగ్రహం

-కేంద్రాలు తెరిచేందుకు పూనుకోవడం సరికాదు

-సమస్యలు పరిష్కరించే వరకూ నిరసనలు

పాడేరులో నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి - విలేకర్ల యంత్రాంగం

సమస్యలను పరిష్కరించాలని అల్లూరి జిల్లాలో అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె శనివారం ఐదో రోజుకు చేరింది. కేంద్రాల తాళాలు తెరిచేందుక అదికారులు వెళ్లడంపై నిరసన చేపట్టారు. ఇటువంటి చర్యలకు పూనుకోవడం తగదని నినాదాలు చేశారు.

పాడేరు:తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న నిరంకుశ వైఖరి పై అంగన్వాడీ వర్కర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ సమస్యల్ని పరిష్కరించకుండా పలుచోట్ల అధికారులు తాళాలు పగలగొట్టి అంగన్వాడీ కేంద్రాలను తెరుస్తున్న వైఖరిపై అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పలుచోట్ల అంగన్వాడి వర్కర్లు తీవ్రంగా నిరసన వ్యక్తం చేశారు. తెరిపించిన అంగన్‌వాడి కేంద్రాల్లో సరుకులు, తదితర సామగ్రి భద్రత పై అధికారులే బాధ్యత వహించాలని అంగన్వాడీలు హెచ్చరించారు. పాడేరులోని ఐసిడిఎస్ కార్యాలయం వద్ద సమ్మెలో భాగంగా శనివారం అంగన్వాడీల నిరసన దీక్ష కొనసాగించారు. నల్ల బ్యాడ్జీలను ధరించి నల్ల రిబ్బన్లతో కళ్ళకు గంతలు కట్టుకొని ప్రభుత్వం తీరుపై అంగన్వాడీలు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తమ ఆందోళనలో భాగంగా అంగన్వాడీలు మండల తహసిల్దార్ వంజంగి త్రినాధరావుకు వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడీలకు గ్రాడ్యుటి చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీలు చేస్తున్న ముంసమ్మె డిమాండ్లు న్యాయమైనవని రాష్ట్ర ప్రభుత్వమే ఇచ్చిన మాట తప్పిందని తెలిపారు. తక్షణం రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి సమ్మెను విరమించే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చే వరకు తమ సమ్మె కొనసాగిస్తామని అప్పటివరకు తమ దశలవారి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు, మండలంలోని వివిధ గ్రామాల అంగన్వాడి వర్కర్లు పాల్గొన్నారు.

చింతూరులో...

ముంచింగిపుట్టు: స్థానిక ప్రాజెక్టు కార్యాలయం అంగన్వాడీల సమ్మె కొనసాగింది. అంగన్వాడీల సంఘం గౌరవ అధ్యక్షురాలు సత్యవతి మాట్లాడుతూ, సచివాలయ సిబ్బందితో అంగన్వాడి కేంద్రాల తాళాలు అక్రమంగా బద్దలు గొట్టేందుకు ప్రయత్నం చేయడం సరికాదన్నారు. సమ్మెకు మండల వైస్ ఎంపీపీ1 పాటు పోయి సత్యనారాయణ, సిపిఎం మండల కార్యదర్శి పాంగి భీమరాజు సంపూర్ణ మద్దతు తెలిపారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మండల వైస్ ఎంపీపీ సత్యనారాయణ మాట్లాడుతూ, అంగన్వాడీల న్యాయమైన డిమాండ్స్‌ను ప్రభుత్వం తక్షణమే పరిష్కారం చేయాలన్నారు. కనీస వేతనం రూ.26000 చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఐదు లక్షలు మంజూరు, గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీల సంఘం అధ్యక్షులు పార్వతి, కార్యదర్శి ఎస్.ఈశ్వరమ్మ, అంగన్వాడీలు మౌలమ్మ, సుజాత, కాంతమ్మ, అంగన్వాడీలు, మినీ అంగన్వాడీలు, ఆయాలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ముంచంగిపట్టులో సాబ్జి చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న అంగన్‌వాడీలు

యానిమేటర్ల సంఘీభావం.

డుంబ్రిగుడ:సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీ కార్మికులు చేపడుతున్న సమ్మె ఐదవ రోజు కొనసాగింది. మండలంలోని యానిమేటర్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి.బాలకృష్ణ శనివారం ఆందోళనలో పాల్గొని సంఘీభావం ప్రకటించారు. గత ఎన్నికల ముందు అంగన్వాడి కార్మికుల సమస్యల పరిష్కారానికి ఇచ్చిన హామీలను అమలు పరచాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కే కొండమ్మ, కే.సత్యవతి, జి.పవిత్ర, అంగన్వాడీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పెదబయలు: మండల కేంద్రంలో ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీల ఆందోళన కొనసాగింది. సమస్యలు రాష్ట్రప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షురాలు టి.రాజమ్మ, కార్యదర్శి సుశీల, మంగ, పద్మ పాల్గొన్నారు.

రంపచోడవరం:తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు అనుబంధం అంగన్వాడీ సంఘాల పిలుపు మేరకు అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె ఐదో రోజుకు చేరింది. స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన శనివారం ఆందోళన కొనసాగించారు. మధ్యాహ్నం భోజనం తర్వాత కబడ్డీ, ఇతర ఆటపాటలతో నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా కోశాధికారి కె.వెంకటలక్ష్మి, ప్రాజెక్ట్ లీడర్ బి.సింగారమ్మ సెక్టార్ లీడర్ ఎం సత్య వేణి, ప్రాజెక్ట్ కోశాధికారి కే అంజమ్మ, సెక్టర్ లీడర్ కే మంగయమ్మ, అంగన్వాడి కార్యకర్తలు, హెల్పర్స్, మినీ అంగన్వాడీలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

చింతూరు : చింతూరు ఐటిడిఎ వద్ద అంగన్వాడీలు చేపట్టిన ఐదో రోజు ఆందళనను మాజీ జెడ్పిటిసి, మహిళా సంఘం నాయకురాలు ముర్రం రంగమ్మ ప్రారంభించారు. డొంకరాయి ఎంపీటీసీ కరక వెంకటరమణ, మద్దతు తెలియజేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు పల్లపు రాములు, గిరిజన సంఘం నాయకులు కారం సుబ్బారావు, పెనుబల్లి వెంకయ్య అంగన్వాడీలు ముచిక జయ, సరియన్ లలిత, రాజకుమారి, సున్నం, దుర్గ, తదితరులు పాల్గొన్నారు.

విఆర్.పురం : మండలంలోని రేఖపల్లి మండల కేంద్రంలో వందల సంఖ్యలో అంగన్వాడీలు చేపట్టిన నిరసన కార్యక్రమాన్ని శనివారం సిపిఎం నాయకులు పూలమాలు వేసి ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా మొండి వైఖరి విడిచిపెట్టి అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు సత్యనారాయణ, సిరాపు తాతబాబు, ప్రకాష్‌రావు, హజరత్, అంగన్వాడీ యూనియన్ నాయకులు రాజేశ్వరి, నాగమణి, పెద్ద సంఖ్యలో అంగన్వాడీలు పాల్గొన్నారు.

అడ్డతీగల : స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో అంగన్వాడీలు ఐదో రోజు నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకొని, మౌనవ్రతం పాటిస్తూ నిరసన తెలిపారు. వీరి ఆందోళనకు కాంగ్రెస్ సీనియర్ నాయకులు దంగేటి సత్తిబాబు, టిడిపి మండల అధ్యక్షుడు జర్త వెంకటరమణ, సీనియర్ నాయకులు జుజ్జువరపు శ్రీనివాస్ చౌదరి, ప్రధాన కార్యదర్శి వడ్డీ రాంబాబు, మేడిశెట్టి శ్రీనివాస్, చదువు రామకృష్ణ, అబ్బాయి రెడ్డి, నాయకులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి నిర్మల, బేబీ రాణి పాల్గొన్నారు.

అడ్డతీగలలో...

పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు

రాజవొమ్మంగి : తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ఈనెల 12 నుండి సమ్మె చేస్తుండగా, తమకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా అధికారులు అంగన్వాడి కేంద్రాల తాళాలను పగలగొట్టడంపై అంగన్వాడీలు శనివారం రాజవొమ్మంగి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడి యూనియన్ నాయకురాలు కె.వెంకటలక్ష్మి, గిరిజన సంఘం మండల అధ్యక్షులు కె జగన్నాథం, డివైఎఫ్ఐ నాయకులు టి శ్రీను తదితరులు మాట్లాడుతూ ఐసిడిఎస్, సచివాలయం సిబ్బంది మహిళా పోలీసులు దౌర్జన్యంగా అంగన్వాడీ కేంద్రాల తాళాలను పగలగొట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కేంద్రాల్లో విలువైన వస్తువులు, రికార్డులు, సరుకులు పోతే ఎవరు సమాధానం చెబుతారని ప్రశ్నించారు. తక్షణ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో అంగన్వాడీలు పాల్గొన్నారు.

భిక్షాటన

మారేడుమిల్లి : మారేడుమిల్లిలో తహశీల్దారు కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న అంగన్వాడీలు శనివారం తమ డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని కోరుతూ మారేడుమిల్లి పురవీధుల్లో తిరుగుతూ భిక్షాటన చేశారు. దీనికి ముందు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గోదావరి జిల్లా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మారేడుమిల్లి, వై రామవరం అంగన్వాడీలు పాల్గొన్నారు.

పెదబయలులో నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు

తెల్లరాయికి రెక్కలు

- **అనుమతుల్లేకుండా తవ్వకాలు**
- **ముడుపుల మత్తులో పట్టించుకోని అధికారులు**

ప్రజాశక్తి-చింతూరు

తెల్ల క్వార్జ్ (తెల్లరాయి)ను తెల్ల బంగారంగా పిలుస్తారు. బంగారు గనులు ఉండడం ఎంత అరుదో.. తెల్లరాయి నిక్షేపాలు కూడా అంతే అరుదుగా ఉంటాయి. చింతూరు మన్యంలో రెవెన్యూ, అటవీ, అసైన్మెంట్, ప్రభుత్వ భూములలో అత్యంత నాణ్యమైన తెల్లరాయి నిక్షేపాలు ఉన్నాయి. ఈ నిక్షేపాలపై తెల్లరాయి అక్రమార్కుల కన్ను పడింది. కోట్లు విలువ చేసే తెల్లరాయిని ఎలాంటి అనుమతులు లేకుండానే అక్రమార్కులు కొండలను పిండి చేస్తూ కాసులు పంట పండించుకుంటున్నారు. అక్రమార్కులు మూడు గుట్టలు - ఆరు లారీలుగా తెల్లరాయిని తరలిస్తూ చింతూరు ఏజెన్సీని ఏలుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. అనుమతులు లేకుండా తెల్లరాయి తరలిస్తున్న అక్రమార్కులపై చర్యలు తీసుకోకుండా వారు ఇచ్చే మామూళ్ళ మత్తులో మైనింగ్ అధికారులు ఊగుతున్నారని పలువురు విమర్శిస్తున్నారు. రెవెన్యూ, అటవీ, పోలీస్ అధికారులు సైతం ఈ అక్రమార్కులపై చర్యలు తీసుకోకుండా ప్రేక్షక పాత్ర వహిస్తున్నారని ప్రజల నుండి గుసగుసలు వినిపిస్తున్నాయి.

చింతూరు మండలంలో గూడూరు, మధుగూరు, కుయుగూరు గ్రామాల్లో తెల్లరాయి స్టాక్ పెట్టుకునేందుకు గతంలో అనుమతులు తెచ్చుకున్నారు. కానీ తెల్లరాయి తవ్వకాలకు ప్రస్తుతం ఎటువంటి అనుమతులు లేవు. అయినా రాత్రికి రాత్రి తెల్లరాయి తవ్వి స్టాక్ పాయింట్లకు తరలిస్తున్నారు. తవ్వకాలకు అనుమతి లేకుండా స్టాక్ పాయింట్లకు ఏ విధంగా తెల్ల రాయి గుట్టలు గుట్టలుగా వచ్చి పడుతుందో తెలియటం లేదు. ప్రకృతి వనరులు అక్రమార్కుల చేతిలో అన్యాక్రాంతం అవుతున్నా పట్టించుకునే నాధులే లేరని మండల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. తెల్లరాయి అక్రమార్కులు దొరికినంత తవ్వుకొని కోట్లాది రూపాయలు గడిస్తున్నారు. అక్రమార్కుల తెల్లరాయి దందాకు ఏ అధికారి చెక్ పెడతారో అని మండల ఎదురుచూస్తున్నారు.

తరలించడానికి సిద్ధంగా ఉన్న తెల్లరాయి

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలో ములకనపల్లి గ్రామ పంచాయితీ కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఎంపిపి కారం లక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులందరూ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఎక్కువగా ఏర్పాటు చేసి తడిచిన ధాన్యాన్ని సైతం రైతుల వద్ద నుండి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌టిపిసి సభ్యులు వాళ్ళ రంగారెడ్డి, స్థానిక సర్పంచ్ సవలం మారయ్య, వ్యవసాయశాఖ ఏవో, సిపిఎం నాయకులు, టిడిపి మండల కార్యదర్శి బురక కన్నారావు, నియోజక వర్గం వాణిజ్య విభాగ అధ్యక్షులు బీరక సూర్య ప్రకాష్‌రావు, రైతులు పాల్గొన్నారు

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపిపి కారం లక్ష్మి

సివిల్స్, గ్రూప్ పరీక్షల ఉచిత శిక్షణ వాయిదా

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలోని గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన గిరిజన యువతీ యువకులకు సివిల్ సర్వీసెస్, గ్రూప్ 1, గ్రూప్ 2 ఉద్యోగాలకు ఐటిడిఎ ఆధ్వర్యాన ఈనెల 18వ తేదీ నుండి ప్రారంభం కావాల్సిన ఉచిత శిక్షణా తరగతులు అనివార్య కారణాల వలన వాయిదా వేసినట్లు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ తదుపరి శిక్షణా ఎప్పుడనేది తెలియజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. సివిల్ సర్వీసెస్,గ్రూప్ 1,గ్రూప్ 2 శిక్షణకు ఎంపికైన గిరిజన యువతీ యువకులు దీనిని గమనించాలని కోరారు.

ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మరణం తీరని లోటు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

అడ్డతీగలలో పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటిస్తున్న యుటిఎఫ్ నేతలు, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్

ఎమ్మెల్సీ షేక్ సాబ్జి రోడ్డు ప్రమాదంలో ఆకస్మిక మృతి తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం అరకులోయ ఆదివాసి గిరిజన భవనంలో సాబ్జీ చిత్రపటానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరారావు, నాయకులు కె.సురేంద్ర, కె.లోకనాధం, పి.అప్పలనర్స, డి.గంగరాజు, బి.చిన్నయ్యపడాల్, వి.ఉమా మహేశ్వరరావులు సాబ్జి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఉపాధ్యాయుడుగా సాబ్జి మంచి పేరు సంపాదించి యుటిఎఫ్‌లో రాష్ట్ర ఉపాధ్యక్షుడుగానూ, అధ్యక్షుడుగా పని చేశారన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై శాసనమండలిలో తన గొంతును వినిపించారని కొనియాడారు.

అడ్డతీగల : గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ గొప్ప పోరాట యోధుడు, నిర్వార్థ నాయకుడని యుటిఎఫ్ అల్లూరి జిల్లా కార్యదర్శి తేజరావు అన్నారు. శుక్రవారం కారు ప్రమాదంలో మృతి చెందిన సాబ్జీ సంతాప సభ యుటిఎఫ్ ఆధ్వర్యాన శనివారం ఎంఆర్‌సి కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా సాబ్జీ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా తేజరావు మాట్లాడుతూ సాబ్జీ మృతి ఉపాధ్యాయ ఉద్యమంతో పాటు ఇతర ప్రజా ఉద్యమాలకు తీరని లోటని పేర్కొన్నారు. సాబ్జీ మృతికి ప్రగాఢ సంతాపం, ఆయన కుటుంబానికి సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్షుడు కుంజం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రాఘవులు, ఆడిట్ మెంబర్ మంగరాజు, మహిళా కార్యదర్శి జెవిబి రమణమ్మ, నాగ ప్రసాద్, బొంకు దొరబాబు, నాగన్నదొర, సెక్రటరీ జగదీష్, యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

కూనవరంలో నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నేతలు, ఉపాధ్యాయులు

కూనవరం : కూనవరం మండల విద్యా వనరులు కేంద్రంలో యుటిఎఫ్ అధ్యక్షులు అనిగె నాగేశ్వరరావు అధ్యక్షతన ఉద్యమతార కామ్రేడ్ షేక్‌సాబ్జీ సంతాప సభ జరిగింది. సాబ్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి పి.కన్నారావు మాట్లాడుతూ సాబ్జీ మృతితో ప్రశ్నించే గొంతుక మూగ బోయిందన్నారు. సాబ్జీ లాంటి ఉద్యమ నేతను కోల్పోవడం యుటిఎఫ్‌కు, ఉద్యమానికి తీరని లోటని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శాంత, సత్య, జయ, మహాతి, కుమారి, ప్రమీళ, ఆనంద్, బాపన్న, రాంబాబు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-రంపచోడవరం : స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ద్వారా విడుదలైన జీడీ కానిస్టేబుల్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న ఎస్టీ అభ్యర్థులకు 40 రోజులపాటు ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందని రంపచోడవరం ఏఎస్‌పి జగదీష్ అడహళ్లి తెలియజేశారు. శనివారం రంపచోడవరంలోని స్థానిక ఏఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ద్వారా సుమారు 26,146 జీడీ కానిస్టేబుల్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ జారీ చేయడం జరిగిందని, దరఖాస్తులు ఆన్లైన్ ద్వారా చేసుకోవాలని సూచించారు. దరఖాస్తును ఈ నెల 31 లోగా అందజేయాలని, ఆసక్తి కలిగిన అభ్యర్థులు నిర్ణిత గడువులోపు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. అభ్యర్థులు దరఖాస్తు చేసుకునే సమయంలో ఆన్లైన్‌లో క్యాటగిరి విభాగంలో ఎస్టీ అభ్యర్థులు ఎస్టి ఏవోబి అనే ఆప్షన్ను పెట్టుకోవాలని అలా పెట్టుకోవడం వల్ల మరింత రిజర్వేషన్ పొందే అవకాశం వారికి ఉంటుందని చెప్పారు. రంపచోడవరం సబ్ డివిజన్‌లోని పది పోలీస్ స్టేషన్లో పరిధిలోని అభ్యర్థులకు 40 రోజులపాటు ఐటీడీఏ సహాయ సహకారంతో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. ఉచిత శిక్షణ కొరకు అభ్యర్థులు రిజిస్ట్రేషన్ నెంబరు, తమ వ్యక్తిగత చిరునామాలు గ్రామంలోని మహిళా పోలీసులకు గాని లేదా సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో గాని నమోదు చేసుకోవాలని సూచించారు. ఈనెల 23వ తేదీన స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించి అందులో ఎంపిక కాబడిన 50 మంది అభ్యర్థులకు 40 రోజులపాటు ఉచిత భోజన వసతితో కూడిన శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 26వ తేదీ నుండి అడ్డతీగల వైటీసీ నందు శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని,ద దీనిని యువత సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మాట్లాడుతున్న ఎఎస్‌పి జగదీష్

కొనసాగిన సిహెచ్‌డబ్ల్యుల దీక్ష

- ఆశా వర్కర్లుగా గుర్తించాలని డిమాండ్

నినాదాలు చేస్తున్న సిహెచ్‌డబ్ల్యులు

ప్రజాశక్తి-పాడేరు: తమను ఆశా వర్కర్లుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఐటిడిఏ ఎదుట సిహెచ్‌డబ్ల్యులు నిరవధిక దీక్షను చేపట్టారు. ఆశా వర్కర్లతో కలిసి 36 గంటల నిరసన దీక్ష కొనసాగించిన సిహెచ్‌డబ్ల్యులు తమ నిరవధిక దీక్షను చేపట్టారు. గత వారం తొమ్మిది రోజులపాటు ఐటిడిఎ ఎదుట సిహెచ్‌డబ్ల్యులు రిలే నిరాహార దీక్షలు నిర్వహించిన సంగతి విధితమే. తుఫాన్ కారణంగా కొన్ని రోజులు తమ నిరవధిక దీక్షను వాయిదా వేసి గురువారం నుంచి యధావిధిగా నిరవధిక దీక్షను కొనసాగిస్తున్నారు. వివిధ ఉద్యోగ సంఘాలు ప్రజా సంఘాలు వీరి ఆందోళనకు మద్దతు తెలిపాయి

ఈ నిరవధిక దీక్షను ఉద్దేశించి సిహెచ్‌డబ్ల్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు వై మంగమ్మ మాట్లాడుతూ, ఇప్పటికే పలుమార్లు సిహెచ్‌డబ్ల్యులు ఆందోళన కార్యక్రమాలను నిర్వహించారని, అధికారులు హామీలు ఇస్తున్నారు తప్ప అమలు చేయలేదన్నారు. ఏజెన్సీలో ఆశా వర్కర్ల పోస్టులు భర్తీ చేయలేదని చెప్పారు. సిహెచ్ డబ్ల్యులను తక్షణమే ఆశా వర్కర్లుగా గుర్తించి వేతనాలను నెలకు పది వేల చొప్పున చెల్లించాలని, యూనిఫామ్, మందుల కిట్లు పంపిణీ తదితర సమస్యల్ని పరిష్కరించేందుకు అధికారులు చొరవ తీసుకొని ప్రభుత్వానికి ప్రతిపాదించి తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ నిరవధిక దీక్షలో ఆశ/ సిహెచ్‌డబ్ల్యుల సంఘం నాయకులు కే పార్వతి, పి.దాసమ్మ, టీ.మాదకొండ, కే.చిన్న తల్లి తదితరులు పాల్గొన్నారు.

సిఎం పర్యటనను విజయవంతం చేయండి

-జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-పాడేరు: ఈ నెల 21న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జిల్లాలో పర్యటించే అవకాశ ముందని, విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం క్యాంపు కార్యాలయం నుండి జిల్లా అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో కలక్టర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి 21న ఉదయం 11.00 గంటలకు చింతపల్లి చేరుకొని ఆశ్రమ స్కూల్‌లో విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తారన్నారు. అనంతరం డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొంటారని తెలిపారు. ఎటువంటి లోటు పాట్లు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. హెలిపాడ్, బారి కేడింగ్ ఏర్పాటు చేయాలని ఇఇని ఆదేశించారు. బారికేడింగ్, వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేయాలన్నారు. రహదారికి ఇరువైపులా తుప్పలను తొలగించాలని ఆదేశించారు. సభాస్థలిలో ఎగుడు దిగుడులు లేకుండా మైదానాన్ని తీర్చిదిద్దాలని గిరిజన సంక్షేమ శాఖ ఇంజినీరింగ్ అధికారులను, పాఠశాల సుందరీకరణను విద్యాశాఖ, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు చేపట్టాలని ఆదేశించారు. ఇప్పటి వరకు నాలుగు లక్షల ఎకరాలకు అటవీ హక్కు పత్రాలు మంజూరు చేయటం జరిగిందని, మరో 500 మందికి హక్కు పత్రాలు ముఖ్యమంత్రి చేతులమీదుగా అందించటానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సుమారు పది వేల మంది ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున వారికి నీటి కొరత లేకుండా నీటి సరఫరా చేయాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమానికి సంబంధించి ఉన్నత స్థాయి అధికారులను నోడల్ అధికారులగా నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జేసి శివశ్రీనివాసు, ఐటిడిఎ పిఒ వి.అభిషేక్, ఎఎస్పి ప్రతాప్ శివ కిషోర్, డిఆర్డిఎ పిడి మురళి, గిరిజన సంక్షేమ శాఖ, ఆర్ అండ్ బి ఇంజినీరింగ్ అధికారులు, తదితరులు

బాలికకు హెల్పింగ్ హ్యాండ్స్ సాయం

ప్రజాశక్తి- చింతపల్లి: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయపడిన బాధిత బాలికకు హెల్పింగ్ హాండ్స్ ప్రతినిధులు ఆర్థిక సహాయం చేశారు. మండలంలోని తాజంగి పంచాయతి బోయపాడు గ్రామానికి చెందిన మణుగూరు రామారావు కుమార్తె భావస్య(7) టీ.కోరుకొండ ప్రాథమిక పాఠశాలలో 3వ తరగతి చదువుతుంది. పాఠశాల నుండి ఇంటికి నడిచి వెళ్తున్న సమయంలో గుర్తు తెలియని ద్విచక్ర వాహనదారుడు బాలికను ఢీకొట్టింది. నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో పాప పరిస్థితిని గమనించిన వైద్యులు కాలుకు శస్త్ర చికిత్స అవసరం అవుతుందని కేజీహెచ్ కు వెళ్లాల్సిందిగా తల్లిదండ్రులకు సూచించారు. హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షులు మల్లేష్ స్పందించి నర్సీపట్నంలోని వివిఎస్ నర్సింగ్ హోమ్‌లో శస్త్ర చికిత్స చేసేందుకు ముందుకు వచ్చారు. పాప ఎడమ కాలుకు సర్జరీ నిర్వహించి దాతృత్వాన్ని చాటుకున్నారు. హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షులు, సభ్యులు పాపకు సర్జరీకి అవసరమైన 7600 రూపాయల ఆర్థిక సహాయం చేశారు.

ఉచిత గ్యాస్ కనెక్షన్ల పంపిణీ

గ్యాస్ ఇస్తున్న గోదాము ఇన్‌చార్జి

ప్రజాశక్తి-జి.మాడుగుల: స్థానిక జిసీసీ కార్యాలయంలో శనివారం లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు. గ్యాస్ గోదాము ఇంచార్జ్ రామచంద్ర రాజు మాట్లాడుతూ, ఇప్పటికీ గ్యాస్ కనెక్షన్ లేనివారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐకెపి ఎపిఎం సుందరమ్మ, బోయితేలి పంచాయతీ ఎంపీటీసీ అప్పలరాజు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

గీతం పూర్వ విద్యార్థుల సమ్మేళనం

హోం కమింగ్ పేరిట నిర్వహణ

సమ్మేళనంలో పాల్గొన్న గీతం అధ్యక్షుడు శ్రీభరత్

ప్రజాశక్తి -మధురవాడ : హోంకమింగ్ పేరుతో నిర్వహిస్తున్న గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని శనివారం గీతం అధ్యక్షుడు ఎమ్ శ్రీభరత్ ప్రారంభించారు. దేశ విదేశాలలోఉంటున్న గీతం పూర్వ విద్యార్థులు ఈ ఉత్సవాలకు పెద్దఎత్తున తరలి వచ్చారు. ఈ సందర్భంగా గీతం అధ్యక్షుడు ఎమ్. శ్రీభరత్ గీతం ప్రగతిని, భవిష్యత్ ప్రణాళికలను వివరించారు. గీతం ప్రగతిలో పూర్వ విద్యార్థులు పాలు పంచుకోవాలని పిలుపునిచ్చారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ప్రముఖ సంస్థలలో ప్రతిభను చాటుతూ కీలక స్థానాలకు ఎదిగిన పలువురు గీతం పూర్వ విద్యార్థులను అవార్డులతో సన్మానించారు. పారిశ్రామిక వేత్తగా ఎదిగిన గీతం పూర్వవిద్యార్థి గౌతమురాన, పరిశోధన, నూతన ఆవిష్కరణల ద్వారా గీతం కు పేరు తెచ్చిన పూర్వ విద్యార్థి సుజ్జిన్ అంగని, క్రీడలు, సాంస్కృతిక రంగంలో రాణిస్తున్న బిహెచ్. గ్యారి, యువ ఆవిష్కర్త మల్లవరపు సూర్యతేజ, మహిళ పారిశ్రామిక వేత్త యార్లగడ్డ గీత, గీతంకు విశిష్ట సేవలు అందించిన ఓ.నరేష్ కుమార్, సేవారంగంలో రాణిస్తున్న వి.కె.వేణుగోపాల్‌లకు విశిష్ట పురస్కారాలను అందజేశారు.

సమ్మేళనంలో భాగంగా విద్యార్థుల సాంకేతిక ఉత్పత్తుల ప్రదర్శన, క్రీడా సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. గీతం పూర్వ విద్యార్థుల రాకతో ఇంజనీరింగ్, ఫార్మశీ, సైన్స్, మేనేజ్మెంట్, దంత వైద్య విభాగాలలో అధ్యాపకులతో ముఖాముఖి కార్యక్రమాలను నిర్వహించారు. పూర్వ విద్యార్థులు తమ కుటుంబ సభ్యులతో సహ హాజరు కావడంతో గీతం ప్రాంగణంలో వినోదాన్ని పంచే స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. మూడేళ్లగా విశాఖ, హైదరాబాద్ ప్రాంగణాలలో క్రమం తప్పకుండా హోం కమింగ్ పేరిట కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని గీతం పూర్వవిద్యార్థుల సంఘం డిప్యూటీ డైరక్టర్ పి.నవీన్ తెలిపారు. కార్యక్రమంలో గీతం కార్యదర్శి ఎమ్. భరద్వాజ, గీతం వైస్ ఛాన్సర్ ప్రొఫెసర్ దయానంద సిద్ధవట్టం, ప్రొవైస్ ఛాన్సర్ ప్రొఫెసర్ వై. గౌతమ్రావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి. గుణశేఖరన్, గీతం స్టూడెంట్ లైఫ్ డీన్ బాలాకుమార్, వివిధ కళాశాలల డీన్ లు పాల్గొన్నారు.

ఇద్దరు వ్యాపారులకు జరిమానా

ప్రజాశక్తి- ముంచింగి పుట్టు: మండల కేంద్రంలో శనివారం జరిగిన వారపు సంతలో అనకాపల్లికి ఇద్దరి వ్యక్తులు పాలితిన్ కవర్లను విక్రయిస్తుండటంతో గిరిజన సంఘం నేతలు, విజిలెన్స్, వర్తక సంఘం నాయకులు పట్టుకున్నారు. పట్టుబడిన వారిని పంచాయతీ సెక్రటరీ గోపికు అప్పగించారు. పంచాయతీ సెక్రెటరీ వారిని మొదటి తప్పుగా పరిగణలోకి తీసుకొని ఒక్కొక్కరికి రూ.1500 చొప్పున ఇద్దరికీ మూడు వేల రూపాయలు జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో వర్తక సంఘం ప్రెసిడెంట్ ఎస్ ప్రసన్నకుమార్, ఆదివాసీ గిరిజన సంఘం మండల కమిటీ సభ్యుడు గాసిరం దొర తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సవరణపై అవగాహన

మాట్లాడుతున్న తహశీల్దార్

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని ఎన్ఆర్ పురం పంచాయతీ వద్ద శనివారం ఓటర్ల మార్పులు, చేర్పులు, సవరణపై వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశామని తహసిల్దార్ రాంబాయి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పిఎస్ నెంబర్ 269 ఓటర్ జాబితాలో చనిపోయిన వారి పేర్లు గుర్తించి గ్రామ సభ ఆమోదం చేయడమైందని పేర్కొన్నారు మండలంలోని పంచాయతీల్లో ఇటువంటి సమస్యలు ఉంటే వాటిని సరి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మాణిక్యం, వి శంకర రావు, పంచాయతీ కార్యదర్శి కె,అర్జున్, బి ఎల్ఓ దీపిక, సర్పంచ్ బడ్నాయిని సన్నమ్మ, మాజీ ఎంపీటీసీ బి రామయ్య, మాజీ సర్పంచ్ కోటపర్తి పొట్టమ్మ పాల్గొన్నారు

జీతాల చెల్లింపులో జాప్యంపై నిరసన

రోడ్డెక్కి ప్లకార్డులతో నిరసన చేపట్టిన ఉక్కు ఉద్యోగులు

ప్రజాశక్తి-ఉక్కునగరం ఈనెల 15వ తేదీ వచ్చినప్పటికీ తమకు జీతభత్యాలు చెల్లించకపోవడంపై ఉక్కు కార్మికులు, ఎగ్జిక్యూటివ్ ఉద్యోగులు రోడ్డుపైకొచ్చి నిరసన చేపట్టారు. స్టీల్ ప్లాంట్‌లో ఉక్కునగరం పొట్టి శ్రీరాములు విగ్రహం నుండి అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ వరకు వేలాదిమంది ప్లకార్డులు పట్టుకుని రోడ్డు పొడుగునా ఆందోళన చేపట్టారు. కార్మికులు, ఎగ్జిక్యూటివ్స్ వేతనాల చెల్లింపులో యాజమాన్యం నిర్లక్ష్యం వీడాలని డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేసే కుట్రలో భాగంగానే సొంత గనుల్ని కేటాయించకపోవడంతో ముడి ఖనిజం లేమితో బ్లాస్ట్ ఫర్నిచర్‌ను మూసేశారని, ఉత్పత్తి జరిగి అమ్మకాలు చేస్తూ లాభాలు గడిస్తున్నప్పటికీ కార్మికుల సకాలంలో జీతాలు చెల్లించకుండా వారిలో నైరాశ్యం నింపుతున్నారన్నారు. స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు అటు యాజమాన్యం కానీ ఇటు స్టీల్ ప్లాంట్ డైరెక్టర్లు కానీ సహకరించడం లేదని విమర్శించారు. దీంతో యువ ఎగ్జిక్యూటివ్స్ ఇప్పటికే చాలామంది ఈ ప్లాంట్‌ను విడిచిపెట్టి వేరే ఉద్యోగాల బాట పడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం కళ్ళు తెరిచి సకాలంలో జీతాలు చెల్లింపు, స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ చర్యలుచేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం యూనియన్ నాయకులు ఆదినారాయణ పాల్గొన్నారు.

18 నుంచి సోమవారం జూ పార్కుకు సెలవు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఈ నెల 18 నుంచి ఇందిరాగాంధీ జంతు ప్రదర్శన శాలకు ప్రతి సోమవారం సెలవు దినంగా పునరుద్ధరిస్తున్నట్టు జూక్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా ఒక ప్రకటనలో తెలిపారు. కార్తీకమాసాన్ని పురస్కరించుకొని నవంబరు 13 నుంచి నెల రోజులపాటు సోమవారం జూ పార్కును తెరిచి, బుధవారం సెలవుగా ప్రకటించిన సంగతి తెలిసిందే. కార్తీక మాసం ముగిసిపోవడంతో గతంలో మాదిరిగా తిరిగి సోమవారం సెలవును పునరుదర్ధరించారు.

కరాటే పోటీల్లో సాయిచరణ్‌కు స్వర్ణం

ప్రజాశక్తి -తగరపువలస : తమిళనాడు, పాండిచ్చేరిలో నిర్వహించిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో స్థానిక శ్రీకృష్ణా జూనియర్ కళాశాల, ఇంటర్ ఫస్టియర్ ఎంపిసి విద్యార్థి బి.సాయిచరణ్ బంగారు పతకం సాధించాడు. శనివారం కళాశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థి సాయిచరణ్‌ను కళాశాల కరస్పాండెంట్ బి నరసింగరావు, ప్రిన్సిపల్ త్రినాథ్, అధ్యాపకులు అభినందించారు.

ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు, స్థానికులు

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని ధర్నా

ప్రజాశక్తి- చింతూరు

మండలంలోని తుమ్మల గ్రామపంచాయతీ పరిధి నారాయణపురం గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని కోరుతూ చింతూరు ఐటిడిఎ కార్యాలయం ఎదుట సిపిఎం ఆధ్వర్యాన స్థానికులు ధర్నా నిర్వహించారు. అనంతరం ఐటిడిఎ పిఒ కావూరి చైతన్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ రెండు వారాల నుంచి కరెంటు లేకుండా గ్రామం మొత్తం చీకట్లో మగ్గుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ లైన్లు మొత్తం అస్తవ్యస్తంగా కిందికి వేలాడుతూ ప్రమాద భరితంగా ఉండటంతో తీవ్ర భయాందోళన చెందుతున్నామని చెప్పారు. మంచినీటి మోటర్ రిపేర్ వల్ల నీళ్లు రాకపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. గ్రామంలోని అంగన్వాడీ భవనం 2014లో ప్రారంభమైన నిర్మాణం పూర్తి చేయకపోవడం వల్ల పూర్తిగా అధ్వానంగా మారిందని, నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని పివోను కోరారు. గ్రామంలో మౌలిక సమస్యలను పరిష్కరించాలన్నారు. సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం స్థానిక సంస్థలకు నిధులు కేటాయించి సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతంలో ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను కేటాయించి మౌలిక సమస్యలు పరిష్కారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ కార్యదర్శి శవలం పంతులు, సోడే రాజయ్య, కూర, దుర్గారావు, సోదే, నాగేష్, రవ్వ, పంతులు, రవ్వ, మల్లయ్య, బొగ్గా, గంగయ్య, తెల్లం, వెంకటేష్, కోర్స, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి వితరణ

ప్రజాశక్తి - విఆర్.పురం : మండలం సీతంపేట గ్రామంలో శుక్రవారం ఉదయం కరెంటు సర్క్యూట్ వలన జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిపోయి ఆస్తి నష్టం పోయిన ముత్యాల చిన్న వెంకటేశ్వర్లు కుటుంబాన్ని తెలుగు దేశం పార్టీ విఆర్ పురం మండల నాయకులు శనివారం పరామర్శించారు. ఆ కుటుంబానికి బియ్యం, నిత్యావసర సరుకులు, దుపట్లు, లుంగీ, పంచలు, టవల్స్, చీరలు అందజేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ఆచంట శ్రీనివాస్, కార్యదర్శి బురక కన్నారావు, జడ్పిటిసి వాళ్ళ రంగారెడ్డి, మాజీ జెడ్పిటిసి ముత్యాల రామారావు, ట్రెజరీ పెందుర్తి సుదర్శన్ రావు, మహిళా అధ్యక్షురాలు ఆకోజు భాగ్యలక్ష్మి, నియోజక వర్గం వాణిజ్య విభాగ అధ్యక్షులు బీరక సూర్యప్రకాష్ రావు, ఎస్సీ సెల్ కార్యదర్శి అచ్చిరాజ్, సీనియర్ నాయకులు పాయం రామారావు, బూత్ కన్వీనర్లు రేవు సింహాచలం, ఆకోజు రంగాచారి, సోడే వెంకమ్మ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకుంటూ..

- అనకాపల్లిలోకి ప్రవేశించిన లోకేష్ యువగళం పాదయాత్ర

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి, మునగపాక, అనకాపల్లి విలేకరి

లోకేష్ యువగళం పాదయాత్ర ప్రజల సమస్యలు తెలుసుకుంటూ శనివారం అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలోకి ప్రవేశించింది. అనకాపల్లిలో భారీ గజమాలలు, డప్పుశబ్దాలు, బాణసంచా నడుమ టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పీలా గోవింద సత్యనారాయణ, జనసేన ఇన్‌ఛార్జ్ పరుచూరి భాస్కరరావు, బుద్ధ నాగజగదీశ్వరరావు ఘన స్వాగతం పలికారు. జిల్లాలో లోకేష్ యాత్ర శనివారానికి ఆరో రోజు పూర్తి చేసుకుంది. లోకేష్ యాత్రలో అనకాపల్లి నియోజకవర్గంలోని వైసిపి గొలగం సర్పంచ్ చంద్రశేఖర్, ఎంపిటిసి అక్కిరెడ్డి వెంకటరమణ, పాడేరు నియోజకవర్గం లగిసపల్లికి సర్పంచ్ పార్వతమ్మ టిడిపిలో చేరారు. వివిధ తరగతుల ప్రతినిధులు వినతిపత్రాలు ఆయనకు అందజేశారు. అనకాపల్లి వేల్పుల వీధిలో కాపు సంక్షేమ సంఘం, నెహ్రూచౌక్ వద్ద ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ అసోసియేషన్, అనకాపల్లి ముప్పన సిల్క్స్ వద్ద అనకాపల్లి చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ సంక్షేమ సంఘం ప్రతినిధులు, బెల్లం వ్యాపారులు వినతిపత్రాలు సమర్పించారు

గిరిజనుల ఇంటి స్థలానికి దారి కల్పించాలి

గిరిజనేతరునికి ఆర్ అండ్ బి స్థలం కట్టబెట్టే ప్రయత్నం ఆపాలి
సబ్ కలెక్టర్‌కు ఎపి ఆదివాసీ గిరిజన సంఘం ఫిర్యాదు

ఫిర్యాదు చేస్తున్న లోతా రామారావు తదితరులు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

వై.రామవరం మండల కేంద్రంలో గిరిజనురాలి ఇంటి స్థలానికి ఆర్ అండ్ బి స్థలంలో నుండి దారి కల్పించాలని, ఆర్ అండ్ బి స్థలాన్ని గిరిజనేతరునికి మండల తహశీల్దారు కట్టబెట్టే ప్రయత్నం ఆపాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు శనివారం రంపచోడవరం సబ్ కలెక్టర్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు, జిల్లా నాయకులు కె.శాంతిరాజు మాట్లాడుతూ, వై.రామవరం మండల కేంద్రంలో గిరిజనరాలు సిద్ద లలిత 1/70, 8/2 సర్వే నెంబర్ గల తమ సొంత భూమిలో ఇంటి నిర్మాణం చేసుకోవడానికి ప్రభుత్వం ఇల్లు మంజూరు చేసిందని తెలిపారు. ఆ ఇంటి నిర్మాణనికి కావాల్సిన మెటీరియల్‌ను అక్కడున్న ఆర్ అండ్ బి స్థలంలో నుండి తెచ్చుకోవడానికి గిరిజనేతరుడు అడ్డుకుంటున్నాడని పేర్కొన్నారు. తమకు దారి కల్పించాలని బాధితరాలు గత సంవత్సరం నవంబర్ నుండి నేటి వరకు రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. ఈ సమస్య గురించి బాధితరాలు తమ వారిని తీసుకొని తాహశీల్దార్ దగ్గరకు అనేక సార్లు వెళితే వారిని ఎవరినీ లోపలకు రానివ్వకుండా, ఒకరిని మాత్రమే రానిచ్చి బెదిరించి వెనక్కి పంపించారని పేర్కొన్నారు. ఆ స్థలాన్ని గిరిజనేతరుడు కబ్జా చేయడానికి చూస్తున్నారని, ఆయన పది మందితో తహశీల్దారు వద్దకు వెళితే వారికి కుర్చీలు వేసి వారితో తహశీల్దారు మాట్లాడుతున్నారని విమర్శించారు. సదరు ఆర్ అండ్ బి స్థలాన్ని గిరిజనేతరుడికి కట్టేబెట్టే ప్రయత్నం జరుగుతుందని అనుమానం వ్యక్తం చేశారు. ఏజెన్సీలో గిరిజనులు, గిరిజనేతరుల మధ్య వివాదం వస్తే గిరిజనేతరులకే న్యాయం జరుగుతుందని, గిరిజనులకు న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గిరిజనరాలికి దారి కల్పించి న్యాయం చేయాలని, ఆర్ అండ్ బి స్థలం గిరిజనేతరులకు అప్పగించే ప్రయత్నాన్ని విరమించుకోవాలని కోరారు. దారి గురించి వై.రామవరం పోలీసు స్టేషన్‌లోనూ, ఎమ్మార్వోకి, రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారికి, సబ్ కలెక్టర్‌కి విన్నవించినా ఆర్ అండ్ బి ఖాళీ స్థలం నుంచి నడవడానికి దారి దొరక్కపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఈతపల్లి సిరిమల్లి రెడ్డి, బాధితులు సిద్ధ లలిత తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ న్యాయవాదిగా వాసుదేవరావు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రముఖ రాజకీయ విశ్లేషకులు, మేధావిగొర్తి వాసుదేవరావు విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ న్యాయవాదిగా నియమితులయ్యారు. విశాఖపట్నం సబ్ డివిజనల్ స్థాయి ఎస్సీ, ఎస్టీయేతర కోటా కింద ఐదుగురు సభ్యుల ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నివారణ కమిటీలో ఆయన స్థానం పొందారు. ఆయన గతంలో కేంద్ర ప్రభుత్వ అధికారిగా పనిచేసి ఉద్యోగ విరమణ అనంతరం బ్యాంక్, లా నిపుణునిగానూ, సామాజిక కార్యకర్తగానూ ప్రజలకు విశేష సేవలు అందిస్తున్నారు.

27న ఉక్కు రక్షణకు మహా ప్రదర్శన, సభ

- విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద తలపెట్టిన దీక్షలు ఈ నెల 27కు వెయ్యి రోజులకు చేరుతున్న సందర్భంగా ఆ రోజు ఉదయం 10 గంటలకు రైల్వే డిఆర్ఎం ఆఫీస్ నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వద్దనున్న దీక్షా శిబిరం వరకు ప్రదర్శన, అనంతరం సభ నిర్వహిస్తున్నట్టు విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి వెల్లడించింది. ఈ ప్రదర్శనలో ప్రజలు అత్యధికంగా పాల్గొని జయప్రదం చేయాలని కోరింది. జగదాంబ వద్దగల ఎన్‌పిఆర్ భవన్‌లో జెఎసి ఆధ్వర్యాన శనివారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఐఎన్‌టియుసి జిల్లా కార్యదర్శి, జెఎసి వైస్ ఛైర్మన్ బోగవిల్లి నాగభూషణం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జెఎసి ఛైర్మన్ ఎం.జగ్గునాయుడు మాట్లాడారు. డిమాండ్ల సాధన కోసం పోరాడుతున్న ఆశా, అంగన్‌వాడీ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సచివాలయం సిబ్బందిని పంపించి తాళాలు పగలగొట్టే చర్యలకు పూనుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆశా వర్కర్ల అక్రమ అరెస్టులపై మండిపడ్డారు. కార్మికోద్యమంపై నిర్బంధానికి దిగితే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కార్యాచరణను వివరించారు. సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎస్‌జె అచ్యుతరావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ఉద్యమం సుదీర్ఘకాలంగా జరుగుతుంటే బిజెపి ఎంపీ జివిఎల్ ఉద్యమాన్ని తప్పుదోవ పట్టించుందుకు ప్రజలను మోసగించే ప్రకటనలు చేయడం సరైంది కాదన్నారు. ప్లాంట్ ప్రైవేటీకరణ చేయబోమని మోడీయే పార్లమెంట్‌లో ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్‌లో ఐదు వేల ఖాళీపోస్టులు తక్షణమే భర్తీచేయాలని, నిర్వాసితులకు ఉద్యోగాలు కల్పించాలని, మూతపడిన బ్లాస్ట్‌ఫర్నేస్‌ను తెరవాలని, సొంతగనులు కేటాయించాలని, వర్కింగ్ క్యాపిటల్ ఇవ్వాలని కోరారు. ఐఎఫ్‌టియు, హెచ్‌ఎంఎస్, టిఎన్‌టియుసి నాయకులు ఎం.వెంకటేశ్వరరావు, డి.అప్పారావు, కెఎన్.నాగార్జునరావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ఉండబట్టే విశాఖ ఇంతలా అభివృద్ధి అయ్యిందన్నారు. కార్యక్రమంలో ఎఐసిటియు నాయకులు శంకరరావు, సిఎఫ్‌టియుఐ నాయకులు కె.లక్ష్మి, రైతు సంఘం నాయకులు జి.నాయనబాబు, ఐద్వా, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, కెవిపిఎస్, పిఎన్ఎం నాయకులు జి.ప్రియాంక, యుఎస్ఎన్.రాజు, జి.పల్లవి, సుబ్బన్న, వై.రాజు, ఎం.చంటి, వైఎస్ఆర్‌సిపి నాయకులు కె.దాలినాయుడు, ప్రజారోగ్యవేదిక నాయకులు టి.కామేశ్వరరావు, ఇతర జెఎసి నాయకులు కె.మల్లయ్య, పి.కృష్ణ, కె.ఈశ్వరరావు, టి.చిరంజీవి పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి పంపిణీ చేస్తున్న జమాల్‌ఖాన్

ప్రభుత్వ పాఠశాలకు క్రీడా సామగ్రి వితరణ

ప్రజాశక్తి-చింతూరు : పొరుగు రాష్ట్రమైన ఒడిస్సాలోని మల్కన్‌గిరి జిల్లా మోటు తాలూకా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్రీడా సామగ్రిని ప్రముఖ వనమూలికల వైద్యులు డాక్టర్ జమాల్ ఖాన్ చేతుల మీదుగా శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో క్రీడల్లో రాణిస్తూ చదువులో వికసించాలని, అప్పుడే ఉన్న వూరికి కన్నవారికి పేరు ప్రఖ్యాతులు లభిస్తాయని తెలిపారు. క్రీడలు దేశ ప్రతిష్టకే కాకుండా దేహ దారుఢ్యానికి ఎంతో దోహదపడతాయని చెప్పారు. జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే గురువుల చెప్పిన విషయాలు భక్తి శ్రద్ధలతో అనుసరించాలని సూచించారు. మంచి ఆహారంతో పాటు ఆటలు కూడా ఆరోగ్యాన్ని ఇస్తాయని, అందరూ క్రమశిక్షణతో విద్యతో పాటు క్రీడల పట్ల ఆసక్తి కనబరచాలని కోరారు. అనంతరం విద్యార్థులకు పలు క్రీడా సామాగ్రినిపాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపాల్‌కు జెకెసి ట్రస్టు కార్యదర్శి ఇమ్రాన్ ఖాన్, ట్రస్ట్ ఇంచార్జ్ సుభాని, సభ్యులు అందజేశారు.

శరవేగంగా సిసి రోడ్డు నిర్మాణ పనులు

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం సీలేరు మేజిరు పంచాయతీ పరిధి పార్వతి నగర్‌లో సిసి రోడ్ల నిర్మాణానికి ఎర్త్ వర్క్, మట్టి లెవెలింగ్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని సర్పంచి దుర్జో పేర్కొన్నారు. శనివారం పనులను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ పార్వతి నగరకు రహదారి సౌకర్యం లేక ఎన్నో సంవత్సరాల నుంచి అనేక ఇబ్బందులు గురవుతున్నారని తెలిపారు. ఎనర్జిఎస్ నిధులు, గడపగడప నిధులతో కలిపి సుమారు 200 మీటర్లు రహదారి పనులు చేపట్టడానికి చర్యలు వేగవంతం చేశామని చెప్పారు. సిసి రోడ్డు పనులు పూర్తయితే పార్వతి నగర్‌కు రహదారి సౌకర్యం కలుగుతుందని పేర్కొన్నారు.

20న పోలిపల్లిలో యువగళం ముగింపు సభ

- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువ గళం పాదయాత్ర ఈ నెల 20న విజయనగరం జిల్లా పోలిపల్లిలో ముగుస్తుందని, ఆ రోజు యువ గళం ముగింపు సభను భారీ ఎత్తున నిర్వహిస్తున్నామని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. రాష్ట్రం నలుమూలల నుంచి ఆరు లక్షల మంది హాజరు కానున్నట్టు వెల్లడించారు. యువగళం ముగింపు కార్యక్రమం విజయవంతం చేసేందుకు ఉత్తరాంధ్ర టిడిపి నేతలతో జిల్లా కార్యాలయంలో ఆయన శనివారం సమావేశమయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువగళం ముగింపు సభను ఎన్నికలకు శంఖారావం పూరించే సభగా నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ఇది రాష్ట్ర భవిష్యత్తు కోసం జరిగే సభ అన్నారు. దీనికి రాష్ట్ర నలుమూలల నుంచి ప్రజలు స్వచ్ఛందంగా తరలిరానున్నట్టు తెలిపారు. ఆ రోజు కూర్మన్న పాలెం నుంచి లక్షలాది మంది ర్యాలీగా బయలుదేరి యువగళానికి చేరుకుంటారని తెలిపారు. అందుకోసం 16 కమిటీలు వేశామన్నారు. సభకు ఆరు లక్షల మంది హాజరవుతారని అంచనా వేస్తున్నట్టు తెలిపారు. టిడిపి అధికారంలోకి వచ్చేనట్లేనని, మిగిలింది ఎన్నికల ప్రొసీజర్ అని అన్నారు. వైసిపి అధిష్టానంపై ఆ పార్టీలో తిరుగుబాటు మొదలైందని తెలిపారు. త్వరలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ కలయికతో సభ జరుగుతుందన్నారు. ఆ సభలో ఉమ్మడి మేనిఫెస్టో ప్రకటిస్తామన్నారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, నిమ్మకాయల చినరాజప్ప, బండారు సత్యనారాయణమూర్తి, దేవినేని ఉమామహేశ్వరరావు, గంటా శ్రీనివాసరావు, కళా వెంకటరావు, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, పి.గణబాబు, ఎమ్మెల్సీలు వేపాడ చిరంజీవిరావు, దువ్వారపు రామారావు, మాజీ ఎమ్మెల్యేలు గండి బాబ్జీ, పల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు.